## క్లుప్తంగా

### భగవద్గీత పుస్తకాలు పంపిణీ



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

జి.సిగడాం: స్థానిక జూనియర్ కళాశాల, సత్య సాయి విద్యా మందిరంలో చదువుతున్న విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను సత్యసాయిబాబా కమిటీ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి 99వ జయంతి ఉత్సవాలు సందర్భంగా టీటీడీ సాయంతో జి.సిగడాం సత్యసాయి భజన మండలి సమక్షంలో 500 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, వెలిది ప్రసాద్. సీహెచ్ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'యూబీ కాలుష్యం నివారించాలి'



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న బంటుపల్లి గ్రామస్తులు

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఉన్న యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్య బూడిద(యాస్) వలన చుట్టుపక్కల గ్రామాల్లోని పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో బంటుపల్లి పంచాయతీ గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వెలువడుతున్న ఈ కాలుష్యం వలన నిత్యం పంటలు నష్టపోవడంతో పాటు, ప్రజలకు కళ్ల సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అధికారులు సత్వరమే స్పందించి కాలుష్యం నివారించాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో బంటుపల్లి మాజీ సర్పంచ్ పాశపు ముకుంద, గ్రామస్తులు కె.అప్పారావు, యు.గిరిబాబు, వి.నాగరాజు, జి.నవీన్ తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి రీసర్వేపై గ్రామసభలు

గార: భూముల రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో పొరపాట్లు సరిచేసేందుకు గ్రామసభలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎస్.రమణారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామసభల వద్ద రెవెన్యూ అధికారుల బృందం ఉంటుందన్నారు. ఈనెల 22న అంబళ్లవలస, 23న బూరవెల్లి, 24న శాలిహుండం, 25న గార, 26న జల్లువలస, 28న వమరవల్లి, 29న కళింగపట్నం, 30న కొర్ని, 31న కొర్లాం, నవంబర్ 2న తూలుగు, 4న జాఫ్రాబాద్, 5న నిజామాబాద్, 6న సతివాడ, 7న రాఘవాపురం, 8న సీతారాంపురం, 11న ఫకీర్‌టకియా, 12న రామచంద్రాపురం, 13న గొంటి, 14న దీపావళి, 16న వాడాడ, 18న వత్సవలస రెవెన్యూ గ్రామాల పరిధిలో సభలుంటాయన్నారు. వాటి పరిధిలోని రైతులు సర్వేలో సమస్యలపై వినతిపత్రాలు అందించవచ్చన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో పాపినాయుడు

జి.సిగడాం: మండల కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎచ్చెర్ల ఐసీడీఎస్ సీడీపీవో డోల పాపినాయుడు సోమవారం తనిఖీలు నిర్వహించారు. 1, 2, 3 కేంద్రాల రికార్డులు, చిన్నారులకు అందించే మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామస్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు ప్రత్యేక నిఘా వేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహదాస్యం రాధిక, సువ్వాడ రమాదేవి, శిల్లా భారతి తదితరులు పాల్గొన్నారు.

### శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని అరిణాం అక్కివలస, చిలకపాలేం గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇక్కడ ఉన్న స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరం

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమని వినియోగదారుల ప్రొటెక్షన్ రైట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంజి ఆర్.ఎజ్రా తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసిపురంలో ఉన్న ఒక చెస్ అకాడమీలో సోమవారం జరిగిన చెస్ పోటీలకు ఆయన సతీమణి(నవోదయ విద్యాలయం టీచర్) అనీరోజ్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 5 రౌండ్లపాటు జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలగా బి.జయంత్, పి.కార్తికేయ, జి.అశ్రితరాం, ఎన్వీ దర్శిత్‌లు నిలిచారు.

# ఉపాధి కరువు.. బతుకు బరువు..!

- పట్టణం పేరుతో పనులకు దూరం
- కుశాలపురం, తోటపాలేం గ్రామాల్లో పేదలకు ఇబ్బందులు
- మరోవైపు పట్టణ ప్రయోజనాలకు సైతం దూరం



తోటపాలేంలో కాలువలో పెరిగిన గుర్రపుడెక్క



కుశాలపురం పరిధిలో కాలువ దుస్థితి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అన్నది గ్రామాల ప్రగతిలో కీలకమైనది. ఈ పథకంలో భాగంగా చెరువులు, కాలువలు, గెడ్డల్లో మట్టి తొలగింపు, జంగిల్ క్లియరెన్స్, మెటీరియల్ కాంపోనెంట్‌లో సిమ్మెంటు రోడ్డులు, డ్రైనేజీలు ఇతర నిర్మాణాలు చేపట్టడం చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు జాబ్ కార్డులు అందజేసి వంద రోజులు పనిదినాలు కల్పించి వేతనం ఇస్తూ వలసలు నిర్మూలిస్తున్నారు. అటువంటి కీలకమైన పథకం ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం, తోటపాలేం గ్రామాలకు వర్తించడం లేదు. ఈ రెండు గ్రామాలది పూర్తిగా వ్యవసాయ నేపథ్యం. ఈ రెండు గ్రామాల్లో నారాయణపురం కుడి కాలువ విస్తరించి ఉంది. కుశాలపురం పరిధిలో యాతపేట, అంబేడ్కర్ నగర్, వెంకటాపురం అనుబంధ గ్రామాలు ఉన్నాయి. తోటపాలేం పరిధిలో దుప్పలవలస అర్బన్ హౌసింగ్ కాలనీ, అఖిఖాన్‌పేట గ్రామాలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం వర్తించక వీరంతా శ్రీకాకుళం పట్టణం, ఇరత ప్రాంతాలకు గృహ నిర్మాణ రంగంలో కార్మికులుగా పనిచేసేందుకు వెళ్తున్నారు.

**విలీనంతో సమస్య**

ఈ గ్రామాలకు 2021 డిసెంబర్ నుంచి ఉపాధి హామీ పథకం పనులు నిలిపివేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఈ రెండు గ్రామాలు విలీనం చేయడంతో సమస్య తలెత్తింది. పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ పనులు వర్తించవు. దీంతో ఈ నిబంధనలు మేరకు ఇక్కడ పనులు మంజూరు కావడం లేదు. అయితే ఈ రెండు గ్రామాలు ఎచ్చెర్ల మండలం, నియోజకవర్గం పరిధిలోనే కొనసాగుతున్నాయి. మరోపక్క నగరపాలక సంస్థ సైతం అభివృద్ధి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో ఈ గ్రామాలు వెనుకబాటుకు గురవుతున్నాయి.

### అభివృద్ధి కుంటు పడుతోంది



పూర్తిగా గ్రామీణ ప్రాంతం, వ్యవసాయ ఆధారిత గ్రామం తోటపాలేం. గ్రామం పరిధిలో ఉపాధి హామీ పథకం అమలు కాకపోవడం వల్ల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాలువలు, చెరువుల్లో పూడికలు తొలగించడం, జంగిల్ క్లియరెన్స్ సైతం సాధ్యం కావడం లేదు. ఉపాధి పనులు లేకపోవడం వల్ల ఇతర కూలీ పనులు ప్రజలు వెతకాల్సిన పరిస్థితి నెలకొంది.

– కళ్లేపల్లి తిరుపతిరావు, మాజీ సర్పంచ్, తోటపాలేం

### ప్రయోజనం లేదు



కొన్నాళ్ల పాటు ఉపాధి హామీ పథకం గ్రామంలో కొనసాగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ప్రయోజనం లేదు. చెరువులు, కాలువల మరమ్మతులు కోసం ప్రత్యేక నిధులు సైతం మంజూరు చేయడం లేదు. అనుబంధ గ్రామాల్లో పనులు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రయోజనం లేక, పల్లెల పథకాలు వర్తించక గ్రామం అభివృద్ధిపై ప్రభావం పడుతుంది.

– పైడి వెంకన్నగారి శ్రీను, కుశాలపురం.

### పట్టణ ప్రాంతాలకు వర్తించదు

పట్టణ ప్రాంతాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్తించదు. ఈ గ్రామాల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిబంధలు మేరకు వర్తించదని స్పష్టం చేశారు. గ్రామంలో 2021 డిసెంబర్ నుంచి ఉపాధి పనులు నిలిచిపోయాయి.

– శోభాదేవి, ఉపాధి హామీ ఏపీవో, ఎచ్చెర్ల మండలం

## అసిరితల్లి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేట గ్రామంలో వెలసిన గ్రామ దేవత అసిరితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారంతో ముగిసింది. స్వామి సచ్చిదానంద మహా సరస్వతి పర్యవేక్షణలో తెన్నేటి విక్రమశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్ శర్మలు శాస్త్రోక్తంగా ప్రతిష్ట పూజలు నిర్వహించారు. యంత్ర ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, అవబృద స్నానం, ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం మహా అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యుడు, అరసవల్లి ట్రస్టు సభ్యుడు మండవిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా బయోమెట్రిక్ యంత్రాలు



నిరుపయోగంగా పడివున్న బయోమెట్రిక్ యంత్రాలు

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ విద్యార్థుల హాజరు కోసం బయోమెట్రిక్ యంత్రాలు వర్సిటీలో ఏర్పాటు చేశారు. అయితే సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ యంత్రాలు ఉపయోగించడం లేదు. దీంతో లక్షల్లో ఖర్చు చేసిన ఈ యంత్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. మరో పక్క బయోమెట్రిక్ హాజరు సైతం సక్రమంగా అమలు కావడం లేదు.

## రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: గ్రామాల్లో రైతుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో ఎక్కువగా కోర్టులో కేసులు ఉండడంతో సమస్య పరిష్కారం సాధ్యమవ్వడం లేదన్నారు. రబీలో రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసేందుకు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు రాధిక, భూసర్వే డీటీ గాయత్రి, సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**విజయవంతం చేయండి**

గతంలో చేపట్టిన భూసర్వేపై మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నామని, వీటిని రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. నవంబర్ 16వ తేదీ వరకు సభలు నిర్వహిస్తామన్నారు. 22న ఆనందపురం, 23న అబోతులపేట, 24న పాలఖండ్యాం, 25న జగన్నాథపురం, 26న సీతారాంపురం, 28న టీడీవలస, 29న నక్కపేట, 30న గేదెలపేట, నవంబర్ 1న ఎన్‌జీఆర్‌పురం, 2న నాయుడు వలస, 4న ముషినివలస, 5న జాడ, 6న వెంకయ్యపేట, 7న మధుపాం, 8న వెలగాడ, 11న చంద్రయ్యపేట, 12న గంగన్నదొరపాలెం, 13న ఎందువ, 14న కప్పరాం, 15న నర్సింహంపురం, 16న సిగడాం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

## వృథాగా ఎంఎస్ఐఈడీ కిట్లు



వృథాగా పడివున్న కిట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు అందజేసే ఎంఎస్ఐఈడీ కిట్లు వృథాగా పడి ఉన్నాయి. ఈ కిట్లుతో ఉన్న పరికరాలు మెరుగైన రక్త ప్రసరణ, బ్యాలెన్స్ మెంటల్ కండీషన్‌కు ఉపయోగపడతాయి. కానీ వీటిని అలా వదిలేయడం వలన ప్రభుత్వాల ఆశయాలు దెబ్బతింటున్నాయి.

# సపక్‌తక్ర పోటీలకు సై

- శ్రీకాకుళంలో నేడు, రేపు పోటీలు
- ముస్తాబైన ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ క్రీడా మైదానం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా సపక్‌తక్ర అసోసియేషన్
- జిల్లాకు చేరుకున్న వివిధ జిల్లాల క్రీడాకారులు



క్రీడా కోర్టులకు తుది మెరుగులు దిద్దుతున్న సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: సపక్‌తక్ర స్టేట్‌మీట్‌కు సర్వం సిద్ధమైంది. శ్రీకాకుళం జిల్లా సపక్‌తక్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం, బుధవారం జరగనున్న 34వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల)సీనియర్స్ పురుషులు, మహిళల సపక్‌తక్ర ఛాంపియన్‌షిప్-2024 పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రస్థాయి సపక్‌తక్ర పోటీలు సిక్కోలు వేదికగా మొట్టమొదటిసారిగా జరగనుండడంతో సంఘ పెద్దలు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానం వేదికగా రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల నిర్వహణను ఆ సంఘ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి గాలి అర్జున్‌రావురెడ్డి, సీనియర్ క్రీడాకారులు సమీక్షిస్తున్నారు.

**క్రీడా మైదానం ముస్తాబు**

మరికొన్ని గంటల్లో మొదలుకానున్న ఈ పోటీలకు ఆతిథ్యమిస్తున్న క్రీడా మైదానాన్ని ముస్తాబు చేశారు. జెండాలు అమర్చారు. ఫ్లడ్‌లైట్లను ఏర్పాట్లు చేశారు. వీక్షకులు లోపలకు వెళ్లకుండా కర్రలతో బారికేడ్లు కట్టారు. మొత్తం మూడు క్రీడా కోర్టులను సిద్ధం చేశారు. మార్కింగులు వేసి తుది మెరుగులు దిద్దారు. రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడా జట్లు జిల్లాకు చేరుకున్నాయి. క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు, నిర్వాహకులు, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులంతా కలిపి 300 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరికీ స్థానికంగా వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. రెండు రోజుల పోటీలను విజయవంతం చేయాలని సపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం పోటీలు మొదలవ్వనుండగా, సాయంత్రం 5 గంటలకు ప్రజాప్రతినిధుల నడుమ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు తెలిపారు.



మైదానంలో రిపోర్ట్ చేసిన అనంతపురం జిల్లా క్రీడాకారుల బృందం



ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



జెండాలను అమర్చుతున్న సిబ్బంది

### కరాటే శిక్షణ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని మహిళా వసతి గృహాల్లో విద్యార్థులకు స్వీయ రక్షణ కోసం కరాటే శిక్షణ సోమవారం ప్రారంభించారు. వర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఝాన్సీ ఈ శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ మహిళా స్వీయ రక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళల్లో ధైర్యం, ఆత్మ విశ్వాసం రెండూ అవసరమన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

### 30 రకాల నైవేద్యాలు



నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజలలేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి 30 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

### అప్రమత్తత



రానున్న తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ సూచించారు. రణస్థలం మండలంలోని అల్లివలస, దోనిపేట తుఫాన్ సహాయక కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఐవీ రమణ, తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఈవోపీఆర్డీ వి.ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

– రణస్థలం

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఏఐబీడీపీఏ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీవోటీ పెన్షనర్స్ అసోసియేషన్ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శ్రీకాకుళంలోని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏఐబీడీపీఏ ప్రతినిధి టి.కృష్ణారావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ డీవోటీ పెన్షనర్స్‌కు 15 శాతం ఫిట్‌మెంట్‌తో జనవరి 1, 2017 నుంచి పెన్షన్ రివిజన్ జరపాలని, నెలకు రూ.3వేలు మెడికల్ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కరోనా సమయంలో నిలిపివేసిన మూడు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐబీడీపీఏ రాష్ట్ర నాయకులు ఐసీహెచ్ చరణ్, జిల్లా నాయకులు కె.గోపాలరావు, హెచ్.ఢిల్లేశ్వరరావు, ఎన్.కసవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడిగా వెంకటప్పారావు



వీఆర్‌ఏల సంఘం నూతన కార్యవర్గం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటప్పారావు ఎన్నికయ్యారు. ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బీవీఎస్ రాజులు, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర లింగుట్ల, కడప జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా మాజీ అధ్యక్షుడు అప్పలస్వామిల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు స్థానిక రెవెన్యూ వసతి గృహంలో ఏకగ్రీవంగా సోమవారం జరిగాయి. నూతన ప్రధాన కార్యదర్శిగా కె.గోపీ, సహాధ్యక్షుడిగా బాలకృష్ణ, ఉప అధ్యక్షులుగా జి.రమణ, జి.నాయుడు, ట్రెజరర్‌గా ఎస్.త్రినాథరావు, జాయింట్ సెక్రటరీగా పాగోటి ప్రసాద్‌రావు, మరో ఐదుమంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

## సంక్షిప్తంగా...

**24న వీణ కచేరి**

శ్రీకాకుళం కల్చరల్: కణుగుల పద్మజ 58వ జయంతి సందర్భంగా ఈనెల 24న 'పద్మ నీరాజనం' కార్యక్రమంలో భాగంగా వీణ కచేరి ఏర్పాటు చేసినట్లు శ్రీవేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కణుగుల సుధీర్ కుటుంబ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వరం రెసిడెన్సీలో సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుందని అభిమానులు, కళాభిమానులు హాజరు కావాలని కోరారు.

**ఘనంగా సీతారాముల కల్యాణం**



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉన్న సీతారామ మందిరం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**పక్కాగా క్లాస్‌వర్కు నిర్వహించాలి**

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో క్లాస్ వర్కు పక్కాగా నిర్వహించాలని వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని స్పష్టం చేశారు. వర్సిటీ క్లాస్ వర్కును వీసీ సోమవారం పరిశీలించారు. సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో క్లాస్ వర్కు పరిశీలించారు. విద్యార్థులు, బోధకులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు వర్సిటీ నిర్వహిస్తున్న డిప్లమా వంటి కోర్సులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**ముగిసిన టెట్**

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ – 2024 పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో జరిగాయి. ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో మొత్తం 3,201 మందికి గానూ 2,865 మంది హాజరయ్యారు. 336 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణ పర్యవేక్షించారు.

**బ్యాడ్మింటన్ పోటీలకు వర్సిటీ క్రీడాకారులు**



వీసీ రజిని, అధికారులతో బ్యాడ్మింటన్ క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాల సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ ఛాంపియన్ షిప్ వార్షిక బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఈ పోటీలకు వర్సిటీ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఆరుగురు హాజరవుతున్నారు. వీరు సోమవారం వర్సిటీ వీసీ రజిని, అధికారులను కలిశారు. మెరుగైన ప్రదర్శన చేసి, విజేతలుగా రావాలని ఆమె ఆకాంక్షించారు.

**కూరగాయల ప్రదర్శన**



సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండల కేంద్రం సమీపంలోని కేశవరావుపేట, కొంగరాం, ధర్మవరం తదితర గ్రామాల్లో సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలను ప్రదర్శించి అమ్మకాలు చేపట్టారు. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా, కేవలం సేంద్రీయ ఎరువుల ద్వారా పండించిన కూరగాయులను విక్రయిస్తున్నట్లు ఎన్‌పీఎం సిబ్బంది తెలిపారు. ఇటువంటి కూరగాయలను మండల కేంద్రంలో అధికారులకు అమ్మకాలు చేపట్టడం, ప్రదర్శించడం వలన అందరికీ తెలుస్తుందని తెలిపారు.

**సచివాలయాల్లో ఆధార్ సేవలు**

రణస్థలం: మండలంలోని సచివాలయాల్లో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ సేవలు అందుతాయని మండల ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు సోమవారం తెలిపారు. రణస్థలం, జే.ఆర్.పురం, రావాడ, కోష్ట, వల్లభరావుపేట, తిరుపతిపాలేం, పైడి భీమవరం గ్రామ సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.